
చారిత్రక ఆనవాళ్లు కనుమరుగు

- పురాతన కట్టడాలకు నిలయం లాలాపేట
- శిథిలావస్థలో కొన్ని.. కూలిపోతున్నవి మరికొన్ని..
- పరిరక్షించాలంటున్న ప్రజలు ● విస్మరిస్తున్న అధికారులు


లాలాపేటలో బురుజుకు పగుళ్లు వచ్చిన దృశ్యం


లాలాపేటలో నిజాంకాలం నాటి కోట గోడ కూలిన దృశ్యం

లాలాపేట: నాటి చరిత్ర, సంస్కృతికి సంబంధించిన చరిత్రాత్మక కట్టడాల ఆనవాళ్లు కొన్ని నగరంలోని తార్నాక డివిజన్ లాలాపేటలో ఉన్నాయి. నిజాం నవాబుల పాలనలో ఈ ప్రాంతంలో ఎన్నో చరిత్రాత్మక కట్టడాలు చెప్పుకోదగ్గవి ఉండేవి. లాలాపేట ప్రాంతం పలు కాలనీల్లోకి ప్రవేశించాలంటే నాటి కాలంలో కట్టిన ఊరాకిళ్లు (పెద్ద దర్వాజాలు) ఉన్నాయి. అందులో కొన్ని ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఇలాంటి లాలాపేటలో నాలుగు ఉండేవి. ఒకటి అన్యాక్రాంతం కాగా ప్రస్తుతం మూడు ఉన్నాయి. ఈ వాకిళ్ల 20 అడుగుల ఎత్తు, 10 అడుగుల వెడల్పుతో ఉన్నాయి. తలుపులు ఎంతో బలిష్టంగా ఉన్నాయి. ఇతరులు ఎవరైనా రాత్రి సమయంలో లాలాపేటలో ప్రవేశించాలంటే అంత సులువు ఉండేది కాదు. ఎందుకంటే సాయంత్రం ఆరు గంటలు కాగానే ఈ ఊరాకిళ్లు మూసేవారు. వీటికి ఇరువైపులా హిందూ, ముస్లింల ప్రార్థనా మందిరాలు ఉన్నాయి. ఈ ప్రవేశ మార్గంపై నుంచి భటులు కాపలగా ఉండేవారు.


లాలాపేటలోని నిజాం గడి

నాటి కోటనే నేటి 'గడిస్కూల్'

లాలాపేటలో 'గడి' అనే కోట ఉంది. ఈ గడిలో నవాబులు విశ్రాంతి తీసుకునేవారు. గుర్రపు బగ్గీలు, ఏనుగులు, గుర్రాలు ఈ ప్రాంతంలో కట్టేసి ఉంచేవారు. ఈ కోట చుట్టూ శాంతినగర్ చౌరస్తా నుంచి లాలాపేటలో కొన్ని కాలనీలను కలుపుతూ పెద్ద ప్రహరీ ఉంది. ఎర్రటి ఇసుకరాయితో ఈ నిర్మాణం జరిగింది. ఇప్పటికి ఈ కోట గోడలు అటువైపు నుంచి వెళ్లే వారిని ఆకట్టుకుంటూ చరిత్రకు 'సాక్షి'గా నిలిచాయి. ప్రస్తుతం ఈ 'గడి' కోటలో ప్రభుత్వ పాఠశాల కొనసాగుతుంది. నాటి నుంచి ఈ పాఠశాలను 'గడి స్కూల్' అని పిలుస్తారు. అడుగడుగునా చరిత్రాత్మక కట్టడాలతో లాలాపేట చూడముచ్చటగా ఉంది. ఈ ప్రాంతంలో పర్యటించిన వారికి నవాబు కాలం నాటి చరిత్ర, సంస్కృతి ఇట్టే తెలిసిపోతుంది. ఈ ప్రాంతం నుంచే అప్పటి నవాబుల మౌలాలిలోని దర్గాకు ప్రతి సంవత్సరం సద్దులు పంపేవారు.

కొన్ని అన్యాక్రాంతం..

తార్నాక డివిజన్ లాలాపేట ప్రాంతంలో నిజాం కాలం నాటి కట్టడాలు, నిర్మాణాలు పూర్తిగా కనుమరుగయ్యే దశలో ఉన్నాయి. ఇప్పటికే కొన్ని బుర్జులు, కోట గోడలను కూల్చి వేసి వాటి స్థలాలను సైతం కొందరు ఆక్రమించుకున్నారు. ప్రస్తుతం ఉన్న పెద్ద పెద్ద దర్వాజలు, బుర్జులు, కోట గోడలకు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరి కొన్ని కూలిపోతున్నా ప్రభుత్వం, అధికారులు ఇటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. భావితరాలకు అందించాల్సిన చరిత్ర ఆనవాళ్లను పరిరక్షించే చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యాన్ని వహిస్తున్నారని లాలాపేట వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లాలమ్మ పేరుతో లాలాపేట

నిజాం సర్కారు ఆనాడు గోల్కండ కేంద్రంగా పాలన సాగిస్తున్న వేళ ప్రతి ఏటా మౌలాలీ గుట్టపై జరిగే ఉర్సు ఉత్సవాలకు లాలాపేట మీదుగా వెళ్లేవారు. ఆ సమయంలో విడిది కోసం లాలాపేటలో గడి(ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల కొనసాగుతుంది) ఏర్పాటు చేశారు. ఈ గడి నిర్వహణ బాధ్యతను ఆనాడు లాలామ్మ అనే మహిళ చూసుకునేది దీంతో ఈ ప్రాంతానికి లాలాపేటగా పేరు వచ్చిందని పూర్వీకులు చెప్తుంటారు. గడి చుట్టు పెద్ద ప్రహరీతో పాటు దాదాపుగా 8 దిక్కుల పెద్ద పెద్ద బుర్జులు, దర్వాజలు నిర్మాణం చేశారు. ఈ నిర్మాణాలు నేటికి లాలాపేటలో కొన్ని ఉన్నాయి. వాటిపైన చెట్లు, పిచ్చి మొక్కలు మొలిచాయి, పగుళ్లు పారాయి, కొన్ని కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. అధికారులు స్పందించి నాటి చరిత్రాత్మక కట్టడాలను పరిరక్షించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: గ్రీన్‌ల్యాండ్స్, ఈఎస్ఐ, కుందన్ బాగ్, ఆల్విన్, జనప్రియ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వెంకట్ ప్లాజా, ఒర్రా జ్యువెలర్స్, కృష్ణా జ్యువెలర్స్, ఎక్సైడ్ బ్యాటరీ లేన్, బీకేగూడ, జెక్‌కాలనీ, శివాజీనగర్, ఎల్ఐజీ, ఉదయ్‌నగర్ కాలనీ, హనుమాన్ టెంపుల్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాంతి శిఖర అపార్ట్‌మెంట్స్, అయ్యప్ప టెంపుల్ లేన్, చర్చిగల్లీ, టీవీఎస్ షోరూం లేన్, స్వాతి టిఫిన్స్ వెనుక ప్రాంతం, సనత్‌నగర్ ఫైర్ స్టేషన్, పోలీస్ క్వార్టర్స్, 3ఆర్‌టీ క్వార్టర్స్, ఫతేబాగ్, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, బంజారానగర్, ఓల్డ్ అండ్ న్యూ శాస్త్రినగర్, పీఆర్‌నగర్, ఓల్డ్ సుల్తాన్‌నగర్, ఇండస్ట్రియల్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి జాతర సందర్భంగా సనత్‌నగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు విజయవర్ధన్ నాయుడు రూపొందించిన జాతర పోస్టర్లను మంగళవారం టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అమ్మవారి ఆశీస్సులతో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల ప్రారంభం


డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ప్రసన్నలక్ష్మి

సికింద్రాబాద్: డివిజన్ పరిధిలో అన్ని బస్తీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి తెలిపారు. మంగళవారం శేషాపహాడ్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. అన్ని బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాని శ్రీను, శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల రాజు, అమర్, వసంత, ఎల్లయ్య, మనోహర్, జావీద్, దేవయ్య, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

బౌద్ధనగర్: అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని పురస్కరించుకొని పార్శిగుట్టలోని న్యూ అశోక్ నగర్‌లో వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నేతలు హనుమంతు, జీవన్ లాల్, సత్యనారాయణ, సురేష్, వెంకటేష్, భాస్కర్, యాదగిరి, బట్టల శ్రీను, ఓములు పాల్గొన్నారు.

హోటల్ మెట్లు దిగుతూ వ్యక్తి మృతి

సనత్‌నగర్: హోటల్‌లో భోజనం చేసి వస్తుండగా హఠాత్తుగా కుప్పకూలి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలరాజు వివరాల ప్రకారం.. ఫతేనగర్ శివాలయం రోడ్డులో ఉంటున్న ఆటో డ్రైవర్ పాండు (40) మంగళవారం మధ్యాహ్నం స్నేహితులైన తిరుపతి, నేనావత్ రాజు, ఎం. శంకర్‌తో కలిసి మూసాపేటలోని విక్టోరియా హోటల్‌లో భోజనం చేసేందుకు వెళ్లాడు. భోజనం తర్వాత హోటల్ మెట్లు దిగుతూ ఒక్కసారిగా కిందపడి మృతి చెందాడు. పాండు సోదరుడు ఎస్. రవికి విషయం చెప్పగా ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించాడు. తన సోదరుడి మృతిపై అనుమానాలున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

శాకంబరిగా దర్శనం



బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో శాకంబరి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆషాఢమాసం 3వ మంగళవారం సందర్భంగా దాతలు సమకూర్చిన పలు రకాల కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు దర్శనం కల్పించారు. 25 క్వింటాళ్ల కూరగాయలతో ఆల య ప్రాంగణాన్ని అలంకరించినట్లు ఆలయ కా ర్య నిర్వాహణ అధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపా రు. ప్రకృతి పరంగా లభించే కూరగాయలను ఆషాఢమాసంలో అమ్మవారికి సమర్పించడం ఆ నవాయితీగా వస్తోందని అలంకరించిన కూరగాయలను భక్తులకు ప్రసాదంగా పంచుతామన్నారు.

–అమీర్‌పేట

మడ్‌ఫోర్ట్ బస్తీకి సొంత నిధులతో డ్రైనేజీ వ్యవస్థ


బస్తీలో డ్రైనేజీ పనుల కోసం దించుతున్న పైపులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో 30 ఏళ్ల క్రితం ఏర్పడిన బస్తీలో కనీసం మౌలిక వసతులు కూడా కల్పించకపోవడం దారుణమని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. మూడో వార్డు మడ్‌ఫోర్ట్ బస్తీలో నేటికీ డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో స్థానికులు ఆయనను కలిసి సమస్యను విన్నవించారు. బోర్డు అధికారులతో మొర పెట్టుకున్నా స్పందించడం లేదని వివరించారు. స్పందించిన క్రిశాంక్ తన సొంత నిధులతో డ్రైనేజీ సదుపాయం కల్పిస్తానని హామీ ఇచ్చి వెంటనే రూ.లక్ష వెచ్చించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నడిబొడ్డున ఉన్న మడ్‌ఫోర్ట్ హట్స్ వాసులకు రెండేళ్ల క్రితం వరకు కనీసం విద్యుత్ కనెక్షన్ కూడా లేదని, నేటికీ తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలకు నోచుకోలేదన్నారు. బస్తీగుండా వెళ్లే ప్రధాన పైపులైన్ ద్వారా ఒకట్రెండు పబ్లిక్ నల్లాలపైనే ఆధారపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ భూమిలో ఉన్న ఈ బస్తీ వాసులకు భూబదలాయింపు ద్వారా పట్టాలు ఇప్పించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురువుతాయని, ఈ నేపథ్యంలో తక్షణమే పనులు ప్రారంభిస్తామన్నారు. మంగళవారం డ్రైనేజీ పైపులను పంపడంతో బస్తీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సాంబ అశోక్, వెంకట్, రాములు, రోశప్ప, గురవయ్య, కనక సుందర్, రంగస్వామి, సాయిదేవ్, వెంకట్, బాలరాజు పాల్గొన్నారు.

గ్రేవ్‌యార్డు సమస్య పరిష్కారానికి కృషి



చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

చిలకలగూడ : సికింద్రాబాద్‌లో నివసిస్తున్న పెంతికోస్తు క్రిస్టియన్లకు ప్రత్యేక గ్రేవ్ యార్డు ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నోముల ప్రకాశరావు అన్నారు. చిలకలగూడ హోసన్న పెంతికోస్తు ఫెయిత్ మిషనరీ చర్చిని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో సుమారు వెయ్యి పెంతికోస్తు కుటుంబాలు నివసిస్తున్నాయని, రోమన్లు, క్యాథలిక్ క్రిస్టియన్లకు గ్రేవ్ యార్డులు ఉండగా, పెంతికోస్తులకు ప్రత్యేక శ్మశానవాటిక లేకపోవడంతో సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని కాప్రా బాలాజీనగర్‌కు వెళ్లి దహన సంస్కారాలు నిర్వహిస్తున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని నోముల ప్రకాశరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాస్టర్ జాయ్, సంఘం ప్రతినిధులు మల్లేష్‌రెడ్డి, ప్రసాద్, జేమ్స్, ప్రభుదాస్, రాజేష్, మలాకినీ, విజయ్, సురేందర్, కాంగ్రెస్ నాయకులు నైవేద్యం సాయికుమార్, ఎమ్మార్ శ్రీనివాస్, వహిదుద్దీన్, అభిషేక్, పాల్ సందీప్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొ లింబాద్రి

లాలాపేట: మాగి వెంకన్న రచించిన టీఎస్‌పీఎస్సీ, ఏపీపీఎస్సీ జేఎల్, డీఎల్‌కు సంబంధించిన ఇంగ్లిష్ పుస్తకావిష్కరణ మంగళవారం ఓయూలో జరిగింది. దీనికి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ లింబాద్రి, ఓయూ వీసీ ప్రొ.రవీందర్, ప్రొ. ఘంటా చక్రపాణి, ఓయూ రిజిస్ట్రార్ పి.లక్ష్మీనారాయణ పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లింబాద్రి మాట్లాడుతూ.. మట్టిలో మాణిక్యం వెంకన్న రాసిన ఈ పుస్తకం పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు.

సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా బాలరాజ్



సనత్‌నగర్: సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ బాలరాజ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ముత్తుయాదవ్ ఎస్‌బీకి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొత్తూరు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన బాలరాజ్ బదిలీపై సనత్‌నగర్‌కు వచ్చారు. గతంలో ఆయన జడ్చర్ల ఇన్‌స్పెక్టర్‌గా, నార్సింగ్ డీఐగా విధులు నిర్వర్తించారు.

ఆ కళాశాలలపై చర్యలు తీసుకోండి


మంత్రి సబితకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

లాలాపేట: జీఓ నెం. 74ను అడ్డుపెట్టుకుని కన్వీనర్ కోటా ఇంజినీరింగ్ సీట్లను బ్లాక్ చేస్తూ రూ .లక్షల్లో దండుకుంటున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ, ఓయూ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. 70 శాతం కన్వీనర్ కోటా ఇంజినీరింగ్ అడ్మిషన్లు మొత్తం కన్వీనరే చేపట్టేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో భట్టు శ్రీహరి, నవీన్ యాదవ్, ప్రశాంత్,జి. శ్రీనివాస్, సూర్యం, శ్రీశైలం, శ్రీనివాస్‌గౌడ్, రాజేష్ ఉన్నారు.

దొడ్డికొమురయ్య వర్ధంతి

లాలాపేట: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డికొమురయ్య వర్ధంతిని తెలంగాణ రైతు దినోత్సవంగా ప్రకటించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట దొడ్డికొమురయ్య వర్ధంతిని నిర్వహించి అక్కడ ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూల మాలతో నివాళులర్పించారు. జనగామ జిల్లాకు దొడ్డికొమురయ్య పేరు పెట్టాలన్నారు, ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవి, మమత, శ్రీను,కృష్ణ, సాయికిరణ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం

లాలాపేట: తెలంగాణలోని యూనివర్సిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం అవుతున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని న్యూ సెమినార్ హాల్లో ఓయూ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ అధికారులకు సూచించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ ఆదేశాలతో ఉజ్జయినీ మహంకాళి దేవాలయంతో పాటు చిన్న చిన్న దేవాలయాల వద్ద రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ నెల 9,10వ తేదీల్లో జాతర జరుగనుండటంతో వెంటనే పనులు పూర్తి చేయాలని జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పనులు ముందే పూర్తి చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

అమీర్‌పేట: బీకేగూడ శ్రీరామ్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి హామీ ఇచ్చారు. కాలనీ వాసులు విజ్ఞప్తి మేరకు మంగళవారం స్థానికంగా పర్యటించారు.వర్షపు నీటితో పాటు మంచినీరు తక్కువగా సరఫరా అవుతుందని కాలనీ వాసులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని శేషుకుమారి చెప్పారు.

ఆత్మీయ సమ్మేళనం

సికింద్రాబాద్: రైల్వే ఉద్యోగులు, కార్మికుల హక్కుల సాధనకై దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని జోనల్ అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు. సికింద్రాబాద్ డివిజన్ కేంద్రంలో ఆర్ఆర్‌బీ ద్వారా నూతనంగా నియామకమైన కమర్షియల్ క్లర్క్, టికెట్ చెకింగ్ స్టాఫ్ ఉద్యోగులతో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ చరిత్రను ఉద్యోగులకు వివరించారు. యూనియన్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి హక్కులను సాధించుకున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రవీందర్, ఏడీఎస్ స్వామి, ఫరీద్, రాజిరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

ఉత్సవాలకు నిధులిచ్చే ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్

- నియోజకవర్గ దేవాలయాలకు రూ.1.13 కోట్లు అందించాం
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్


చెక్కులను అందిస్తున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: దేవాలయాల్లో ఉత్సవాల కోసం నిధులు అందించే ప్రభుత్వం దేశంలోనే ఒక తెలంగాణ ప్రభుత్వం మాత్రమేనని అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన నియోజకవర్గంలోని దేవాలయాలకు బోనాల సందర్భంగా ప్రభుత్వం అందించే చెక్కులను నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సనత్‌నగర్ నియోజకవర్గంలోని 167 దేవాలయాలకు బోనాల ఉత్సవాల కోసం రూ.1.13 కోట్ల రూపాయల నిధులు అందించామని బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని తెలంగాణ ప్రభుత్వం వచ్చాక బోనాలు విశ్వవ్యాప్తం కావడంతో అనేక దేశాల్లో కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 9,10వ తేదీల్లో నిర్వహించనున్న ఆలయాలకు చెక్కులు అందించామని 16వ తేదీ జరుగనున్న ఆలయాలకు 10,11వ తేదీల్లో అందజేస్తామన్నారు. ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర సందర్భంగా నగరం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరి, లక్ష్మీబాల్‌రెడ్డి, హేమలత, మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి అరుణగౌడ్, ఉప్పల తరుణి, ఆకుల రూప, కిరణ్మయి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కృష్ణ, మహంకాళి, బల్కంపేట ఆలయాల ఈవోలు మనోహర్‌రెడ్డి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

బోనాల ఏర్పాట్లపై టెలీ కన్ఫరెన్స్ ..

సనత్‌నగర్: బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాట్లను పర్యవేక్షించాలని మంత్రి తలసాని అన్నారు. మంత్రులు మహమూద్‌అలీ, సబితా ఇంద్రారెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో మంగళవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల తొమ్మిదో తేదీన సికింద్రాబాద్ బోనాలు, 16వ తేదీన ఓల్డ్ సిటీ బోనాలు జరుగుతాయని ప్రజాప్రతినిధులు ఏర్పాట్లలో భాగస్వాములై పర్యవేక్షణ జరపాలన్నారు. భక్తులు క్యూ లైన్‌లలో తోపులాట జరగకుండా పటిష్టమైన బారికేడ్లను ఏర్పాటుచేయడంతో పాటు పోలీసు బందోబస్తు, శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న వారు బోనాల ఉత్సవాలను తిలకించేలా ప్రసార మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎనిమిది ప్రాంతాల్లో 3డీ మ్యాపింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్సీలు ప్రభాకర్ రావు, వాణీదేవి, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, మైనంపల్లి హన్మంతరావు, వివేకానంద్, అరికపూడి గాంధీ మాట్లాడారు.

బల్కంపేట ఎల్లమ్మ దేవాలయానికి..

అమీర్‌పేట: బోనాల సందర్భంగా బల్కంపేట ఎల్లమ్మ దేవాలయానికి మంజూరు చేసిన రూ.15 లక్షల చెక్కును మంగళవారం మంత్రి తలసాని ఆలయ కార్య నిర్వాహణ అధికారి ఎస్. అన్నపూర్ణకు అందజేశారు. బోనాల పండుగ సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లకు నిధులను ఖర్చు చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నామన శేషుకుమారి, సాయిబాబాగౌడ్, నర్సింహా పాల్గొన్నారు.

చేనేత చీర నేత పని ప్రారంభం


చీరను తయారు చేసి అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

రాంగోపాల్‌పేట్: పోచంపల్లి చేనేత సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాల జాతరలో సమర్పించేందుకు మగ్గంపై తయారు చేసే పనులను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం ప్రారంభించారు. దేవాలయంలోనే మగ్గంపై పట్టు

బోనాల జాతర వేడుకల ఏర్పాట్లపై సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: ఆషాఢమాసంలో నిర్వహించనున్న బోనాల జాతర ఏర్పాట్లపై మంగళవారం తార్నాకలోని తన కార్యాలయంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి ఆయా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్ లష్కర్ బోనాల వేడుకలను పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని అన్ని దేవాలయాల్లో ఏర్పాట్లు చేయా లని సూచించారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా రోడ్ల మరమ్మతులు చేపట్టా లని ఆలయాల వద్ద నిరంతరం విద్యుత్, నీటి సరఫరా, శానిటేషన్ తదితర పనులు చేపట్టాలన్నా రు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి ప్రజలు వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకునేలా చూడాలన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు


ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన వారిని సత్కరించిన డీసీపీ ఎస్.రంగారావు

సనత్‌నగర్: అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే ప్రజల మన్ననలను పొందుగలుగుతారని నగర ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ఎస్.రంగారావు అన్నారు. సైఫాబాద్ ఎస్ఐ శ్రీనివాస్, నారాయణగూడ ఎస్ఐ మోహన్‌బాబు నాయక్, సైఫాబాద్ ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన సందర్భంగా బేగంపేటలోని ఆయన కార్యాలయంలో మంగళవారం వారిని సత్కరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ.. నిరంతరం శాంతి భద్రతలు, ప్రజా సంక్షేమం కోసం పాటుపడేది ఒక్క పోలీసు మాత్రమే అని అలాంటి వృత్తిలో కొనసాగినంత కాలం ప్రజలకు రక్షణగా ఉంటూనే క్రమశిక్షణకు మారుపేరుగా నిలువాలన్నారు. ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన వారు విధి నిర్వహణలో సమర్థవంతంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, నరసింహ, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న రవిప్రసాద్ గౌడ్

బౌద్ధనగర్: సంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేపీ డివిజన్ అధ్యక్షుడు హనుమంతు ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం పార్శిగుట్ట నుంచి అంబర్‌నగర్ వరకు నిర్వహించిన బైక్‌ర్యాలీని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజులుగా నిర్వహిస్తున్న సంపర్క్ అభియాన్ కార్యక్రమం చివరి రోజుకు చేరిందని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలపై వాడవాడలా ప్రచారం చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. స్వల్ప కాలిక విస్తారక్ జీవన్, సురేష్, అమరావతి, శ్యామ్, భాస్కర్, సత్యనారాయణ, ఓములు, నవీన్, వెంకట్ పాల్గొన్నారు.

నల్లగుట్టలో..

రాంగోపాల్‌పేట్: గత తొమ్మిదేళ్లలో బీజేపీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను తీసుకెళ్తున్నామని కేరళ నుంచి వచ్చిన ఆ పార్టీ స్వల్పకాలిక విస్తారక్ రంజిత్ నాయర్ అన్నారు. మంగళవారం స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్‌తో కలిసి రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని నల్లగుట్టలో ఇంటింటికి తిరుగుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మదన్, నితేష్ భోలే, అశ్విని, పాల్గొన్నారు.

'బీసీ బంధు'ను సద్వినియోగం చేసుకోవాలి

కంటోన్మెంట్: నాయీ బ్రాహ్మణులు బీసీ బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని తన కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని నాయీ బ్రాహ్మణులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 15 కులవృత్తులు చేసుకునే బీసీలకు కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేస్తోందన్నారు. బోర్డు మాజీ సభ్యులు లోకనాథం, నళిని కిరణ్, బీఆర్ఎస్ నేతలు ముప్పిడి మధుకర్, పెద్దాల నరసింమ, నాయీ బ్రాహ్మణ అధ్యక్షులు యాదగిరి, గణేష్, రవి, కిరణ్, సదానంద్, సాయి, రఘు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

లాలాపేట: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన ఓయూ, వారాసీగూడ పోలీస్ స్టేషన్ పరిధుల్లో చోటు చేసుకున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం.. హబ్సిగూడకు చెందిన ఎస్. అరుణ (35) ఈ నెల 3న ఉదయం బ్యాంక్‌కు వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లి ఎంతకీ రాకపోవడంతో భర్త సాంబరాజు మధు మంగళవారం ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

మరో ఘటనలో వృద్ధుడు..

బౌద్ధనగర్: ఇంటి నుంచి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఏఎస్సై వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. వారాసిగూడ ప్రాంతానికి చెందిన పోచయ్య (70) మే నెలలో పని కోసంవెళ్లిన పోచయ్య ఇప్పటి వరకు తిరిగి రాలేదు. తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం భార్య పోచమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.